క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యేల పర్యటన

శాలిగౌరారం: తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ శాలిగౌరారం మండలంలో సోమవారం పర్యటించనున్నట్లు ఇన్‌చార్జి తహసీల్దార్ ఎండి సత్తార్, ఎంపీడీఓ జ్యోతిలక్ష్మి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కందాల సమరంరెడ్డిలు ఆదివారం వేర్వేరు ప్రకటనలలో తెలిపారు. జాలోనిగూడెంలో ×స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమం అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నారు.

మునుగోడు: మండలంలోని పలు అభివృద్ధి పనులు ప్రారంభించేందుకు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సోమవారం మునుగోడుకు రానున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భీమనపల్లి సైదులు ఒక ప్రకటనలో తెలిపారు. మునుగోడులో రోడ్డు విస్తరణ పనులు, నూతన సబ్‌స్టేషన్ పనులతోపాటు జక్కలవారిగూడెంలో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ కార్యాలయం ప్రారంభిస్తారని పేర్కొన్నారు.

యానాల మల్లారెడ్డికి నివాళి

నకిరేకల్ : సీపీఐ ఎంఎల్ న్యూడెమాక్రసీ ఆధ్వర్యంలో ఆదివారం సాయుధపోరాట యోదుడు, రైతు కూలీ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు యానాల మల్లారెడ్డి 22వ వర్ధంతిని నకిరేకల్‌లో జరుపుకున్నారు. మల్లారెడ్డి చిత్రపటానికి పార్టీ జిల్లా నాయకులు ఇందూరు సాగర్, అంబటి చిరంజీవి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నూతన కమిటీ ఎన్నిక

నల్లగొండ టౌన్: రాష్ట్రంలో నేషనల్ హెల్త్ మిషన్‌లో పనిచేస్తున్న మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లకు నెలకు రూ.45 వేల వేతనం ఇవ్వాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్ల (ఎంఎల్‌హెచ్‌పీ) జిల్లా స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా పల్లా దేవేందర్‌రెడ్డి, అధ్యక్షుడిగా కే జోసఫ్, ఉపాధ్యక్షులుగా ఎండీ ఫరీద్, దత్తాత్రేయ, ఈశ్వరి, ప్రధాన కార్యదర్శిగా ఎస్.నాగరాజు, కార్యదర్శిగా మేఘన, సహాయ కార్యదర్శులుగా పి.నవీన్, మనీశ్రీ, కోశాధికారిగా టీ.ప్రవీణ్, కార్యవర్గ సభ్యులుగా జి ప్రతిభ, బి.ఇందు, జి స్రవంతిలు ఎన్నికయ్యారు.

హక్కుల కోసం పోరాడుతాం

నల్లగొండ: ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ హక్కుల కోసం సీపీఐ పోరాడుతుందని సీపీఐ ప్రధాన కార్యదర్శి ఈదురు వెంకన్న అన్నారు. ఆదివారం నల్లగొండలోని మగ్దూం భవన్‌లోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

నోట్ పుస్తకాలు, బ్యాగ్‌లు పంపిణీ

నాంపల్లి : పేద విద్యార్థులకు చదవుతోపాటు నైపుణ్యం కల్పించడమే తమ ట్రస్టు లక్ష్యమని శారదసేవా ట్రస్టు చైర్మన్ శారద అన్నారు. ఆదివారం దామెర, వడ్డెపల్లి, పెద్దాపురం, నేవిళ్లగూడెం గ్రామాల్లో విద్యార్థులకు రూ.లక్షా 20 వేల విలువ గల బ్యాగులు, నోట్ పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేసి మాట్లాడారు.

ఆలయానికి వితరణ

నార్కట్‌పల్లి : చెర్వుగట్టు గ్రామంలోని శ్రీ పార్వతి జడల రామలింగేశ్వర స్వామి దేవస్థానం అన్నదాన సత్రంలో భోజనాలు వడ్డించే స్టాండును ఎల్లారెడ్డిగూడెం గ్రామానికి చెందిన ఐదుగురు స్నేహితులు ఆదివారం విరాళంగా అందజేశారు. విరాళం అందజేసిన లింగయ్య, వడ్డే శ్రీనివాస్‌రెడ్డి, కమటాల స్వామి, బొడ్డుపల్లి శ్రీహరి, వడ్డే శివశంకర్‌రెడ్డిలు ఉన్నారు.

ఉద్యోగులకు సన్మానం



సన్మానం పొందిన ఉద్యోగులు

నార్కట్‌పల్లి : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేసి బదిలీ అయిన డాక్టర్లు, వివిధ శాఖల ఉద్యోగులకు ఆదివారం ఆస్పత్రిలో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. బదిలీ అయిన డాక్టర్ అరుంధతి, డాక్టర్ రామకృష్ణ, సిబ్బంది శైలజ, పద్మ, సురేందర్, శ్రీనయ్య, లక్ష్మీనారాయణ, కిశోర్‌కుమార్, ధనలక్ష్మి, సరోజలను ఘనంగా సన్మానించారు. డాక్టర్ శ్రీహరి ఆదిత్య, సీహెచ్‌ఓ బడుగు శ్రీరాములు, సుజాత, పద్మ, వెంకటమ్మ, పద్మ, మధుసూదన్, స్వామి, నాగమణి, గీత, సుధ తదితరులు ఉన్నారు.

ఫాగింగ్ మిషన్ నడిపిన మంత్రి కోమటిరెడ్డి



నల్లగొండ పట్టణంలోని 19వ వార్డులో దోమల నివారణ కోసం ఓ కాంగ్రెస్ కార్యకర్త సమకూర్చిన ఫాగింగ్ మిషన్‌ను రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆదివారం తన క్యాంపు కార్యాలయంలో ప్రారంభించారు. క్యాంపు కార్యాలయం నుంచి శ్రీనగర్ కాలనీ పార్క్ వద్దకు స్వయంగా నడిపారు.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నల్లగొండ

ఘనంగా ఫ్రెండ్‌షిప్ డే వేడుకలు



నల్లగొండ టూటౌన్: మంత్రి కోమటిరెడ్డికి ఫ్రెండ్‌షిప్ బ్యాండ్ కడుతున్న మహిళ



నల్లగొండ టూటౌన్ : కేక్ కట్ చేస్తున్న వెల్‌నెస్ సెంటర్ స్నేహితులు



నకిరేకల్ : వాసవి క్లబ్ ఆధ్వర్యంలో..



చిట్యాల : కేక్ కట్ చేస్తున్న స్నేహితులు

నల్లగొండ టూటౌన్: జిల్లా కేంద్రంలో ఆదివారం స్నేహితుల దినోత్సవం ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి పలువురు ఫ్రెండ్‌షిప్ బ్యాండ్లు కట్టారు. ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఉన్న వెల్‌నెస్ సెంటర్‌లో స్నేహితులు కేక్ కట్ చేసి ఫ్రెండ్‌షిప్ బ్యాండ్లు కట్టుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

నకిరేకల్ : వాసవి ఇంటర్నేషనల్ ప్రోగాం కోఆర్డినేటర్ బ్రహ్మదేవర పద్మావతి ఆధ్వర్యంలో నకిరేకల్‌లో ఆదివారం స్నేహితుల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. క్లబ్ ప్రతినిధులు గట్టు మల్లిక, కందగట్ల శ్వేత, భవాని, శ్రీలత, లక్ష్మీ, పుష్పలత, శోభ, సులోచన, పద్మ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా వాసవి కపుల్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్నేహితుల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. క్లబ్ అధ్యక్షుడు గుండా నరేందర్, ప్రతినిధులు వీరవెల్లి రఘునాథ్, బచ్చు శ్రీనివాస్, గుండా గోపి, ఉప్పల సంతోష్, శివకోటి ఆంజనేయులు, మీలా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నకిరేకల్ మున్సిపాలిటీ కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి ఫ్రెండ్‌షిప్ డే వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో పూజర్ల శంభయ్య, పన్నాల రాఘవరెడ్డి, గాజుల సుకన్య తదితరులు పాల్గొన్నారు.

చిట్యాల : స్థానిక జెడ్పీహెచ్ఎస్‌లో 1996–97 విద్యా సంవత్సరంలో ఎస్సెస్సీ చదివిన విద్యార్థులు ఆదివారం చిట్యాలలో స్నేహితుల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. కేక్ కట్‌చేసి స్వీట్లు పంచారు. నారబోయిన శ్రీనివాస్, పోకల కరుణాకర్, ముబీన్, సుఖేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

నైపుణ్యాభివృద్ధి సంస్థ నిర్మిస్తాం

- రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



కుట్టు మిషన్ల పంపిణీని ప్రారంభిస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండ : నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు జిల్లా కేంద్రంలో నైపుణ్యాల అభివృద్ధి సంస్థ నిర్మిస్తామని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫి శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. ఆదివారం నల్లగొండలోని తన క్యాంపు కార్యాలయం సమీపంలోని మున్సిపల్ పార్కులో న్యాక్ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన 30 మంది మహిళలకు ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా ఉచిత కుట్టు మిషన్లను ఆయన పంపిణీ చేసి మాట్లాడారు. టైలరింగ్‌లో శిక్షణ పొందిన మహిళలకు ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా ఉచితంగా కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. యువత ఖాళీగా ఉండకుండా ఏదో ఒక రంగంలో శిక్షణ పొంది స్వయం ఉపాధి పొందాలని సూచించారు. కార్యక్రమంలో న్యాక్ ఇన్‌చార్జి అశోక్, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, ఆర్డీఓ రవి, మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసబ్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

నల్లగొండటౌన్: యూత్ కాంగ్రెస్ యువతుల విభాగం శక్తి సూపర్ షీ పోస్టర్‌ను రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆదివారం నల్లగొండలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత రాజకీయాల్లో కూడా రాణించాలనే ఉద్దేశంతో ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ యూత్ కాంగ్రెస్‌లో యువతుల కోసం శక్తి సూపర్ షీ ఏర్పాటు చేశారన్నారు. మహిళల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందాలన్నారు. 18 నుంచి 35 సంవత్సరాల లోపు యువతుల కోసం శక్తి సూపర్ షీ ఏర్పాటు చేశారని మంత్రి తెలిపారు. కార్యక్రమంలో వడ్డేపల్లి ఎల్లోర, సంగెం కీర్తి పాల్గొన్నారు.

కాల్వ పూడికతీత పనులు ప్రారంభం

నల్లగొండ రూరల్: పానగల్ ఉదయ సముద్రం నుంచి ఈ–39, 40 కాల్వలకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సొంత నిధులతో చేపట్టిన పూడికతీత పనులను డీసీసీబీ డైరెక్టర్ పాశం సంపత్ రెడ్డి ఆదివారం ప్రారంభించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వంగూరి లక్ష్మయ్య, నల్లగొండ మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్ మాట్లాడుతూ పూడికతీత పనులు త్వరగా పూర్తి చేసి రైతులకు సాగు నీరు అందిస్తామన్నారు.

పెట్రోలు బంకుల్లో కార్లకు చార్జింగ్ సౌకర్యం

నల్లగొండ టౌన్: జిల్లా కేంద్రంలోని పెట్రోల్ బంకుల్లో ఎలక్ట్రికల్ కార్లు చార్జింగ్ పెట్టుకునే సౌకర్యం ఏర్పాటు చేశారు. ఆదివారం దేవరకొండ రోడ్‌లోని ఇండియన్ పెట్రోల్ బంక్, సాగర్ రోడ్‌లోని మరో పెట్రోల్ బంకులో ఎలక్ట్రికల్ కార్లు చార్జింగ్ పెట్టుకునే సౌకర్యం కల్పించారు. కారుకు పూర్తిగా చార్జింగ్ పెట్టుకోవడానికి రూ.250 చెల్లించాల్సి ఉంటుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు తెలిపారు.

మున్సిపాలిటీలో సమస్యలు పరిష్కరించాలి



చిట్యాల : ఎమ్మెల్యే వీరేశానికి వినతిపత్రం ఇస్తున్న 10వ వార్డు కౌన్సిలర్, ప్రజలు

చిట్యాల : మున్సిపాలిటీ పరిధిలోని 10వ వార్డులో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వార్డు ప్రజలు, కౌన్సిలర్ సిలువేరు మౌనికశేఖర్ ఆధ్వర్యంలో ఆదివారం నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశానికి వినతిపత్రం సమర్పించారు. డ్రెయినేజీలపై స్లాబ్‌లు వేయాలని, వీధి దీపాలు ఏర్పాటు చేయించాలని, సీసీరోడ్లు వేయించాలని కోరారు. కార్యక్రమంలో దాసరి వెంకన్న, గూడ శ్రీకాంత్, ఈసం రాజు, కమ్మరి రవి, ముద్దగోని భిక్షం, కాచం జగదీష్, మంచాల ఎల్లయ్య, రూపని భిక్షం, ఇమ్మడి మీనయ్య, మంచాల యాదగిరి, మునుకుంట్ల సోని, కలుకుంట్ల సత్తయ్య, ఎండీ సఫియా, షరీఫ్, సిలువేరు ఎల్లమ్మ, బొబ్బిలి సైదులు, పెద్దశివాజీ, కలుకుంట్ల శోభ పాల్గొన్నారు.

ఎల్‌ఓసీ చెక్కు అందజేత

కట్టంగూర్ : మండలంలోని ఈదులూరు గ్రామానికి చెందిన పి.నర్సమ్మకు మంజూరైన రూ.1.50 లక్షల విలువ చేసే సీఎంఆర్ఎఫ్ ఎల్‌ఓసీ చెక్కును ఆదివారం నకిరేకల్‌లో ఎమ్మెల్యే వేముల వీరేశం బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఐతగోని నారాయణగౌడ్, వెంకన్న, శ్రీను పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన నాయకులు

నకిరేకల్ : ఎస్సీ వర్గీకరణకు సుప్రీం కోర్టు అనుకులంగా తీర్పునిచ్చిన నేపథ్యంలో నకిరేకల్‌లో ఆదివారం ఎమ్మెల్యే వేముల వీరేశాన్ని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు మాచర్ల సైదులు మాదిగ ఆధ్వర్యంలో కలిశారు. ఈ కార్యక్రమంలో మల్లెపాక వెంకన్న, మామిడి శ్రీను, కొంపెల్లి భిక్షపతి, లంకెపల్లి నగేష్, బాకి యాదగిరి, గట్టు మల్లయ్య పాల్గొన్నారు.

నియామకపత్రం అందజేత

నల్లగొండ: ఇంపాక్టు క్లబ్ ఇంటర్నేషనల్ 2 ప్రెసిడెంట్‌గా నూనె సుదర్శన్ నియమితులయ్యారు. ఆదివారం ఆయనకు హైదరాబాద్‌లో సినీ నటులు కె.వి.ప్రదీప్, గంపా నాగేశ్వర్‌రావు నియామక పత్రం అందజేశారు. నూనె సుదర్శన్ త్రిపురారం మండలం, బెజ్జికల్ వాసి. నిడమనూరు మండలం ఇండ్లకోటయ్యగూడెంలో సుదర్శన్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు.

అట్టహాసంగా నేషనల్ కరాటే పోటీలు



చండూరు : విద్యార్థులను అభినందిస్తున్న మాస్టర్ రాపోలు సుదర్శన్

నకిరేకల్ : మున్సిపాలిటీ కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో 38వ షోటోఖాన్ నేషనల్ కరాటే పోటీలను ఆదివారం స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ పోటీల్లో తెలంగాణ, ఏపీ, మహారాష్ట్ర నుంచి 700 మంది కరాటే క్రీడాకారులు పాల్గొన్నారు. మొత్తం 900 ఈవెంట్స్ ప్రదర్శించారు. ప్రతిభ కనబర్చిన టీమ్‌లకు బెల్ట్‌లను ఎమ్మెల్యే ప్రదానం చేశారు. కరాటే మాస్టర్, అసోసియేషన్ జిల్లా కార్యదర్శి అంతటి సోములుగౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కరాటే చీఫ్ రాపోలు సుదర్శన్, జిల్లా అధ్యక్షుడు నగేష్, మున్సిపల్ వైస్ చైర్మన్ మురారిశెట్టి ఉమారాణి, నాయకులు కందాల ప్రమీల, పన్నాల రాఘవరెడ్డి, గాజుల సుకన్య తదితరులు పాల్గొన్నారు.

చండూరు : జపాన్ కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నకిరేకల్ మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన (పది సంవత్సరాలలోపు) 38వ షోటోఖాన్ జాతీయ స్థాయి కరాటే పోటీల్లో చండూరు మండలానికి చెందిన నలుగురు విద్యార్థులు కాంస్య పతకాలు సాధించారు. గీత విద్యాలయానికి చెందిన సంకోజు సాయిప్రణయ్, సంకోజు మణిదీప్, కారింగు అభిరామ్, కృష్ణవేణి పాఠశాలకు చెందిన ఇరిగి భానుతేజ పతకాలు సాధించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం మెడల్స్ అందజేశారు. కార్యక్రమంలో మాస్టర్ కారింగు రవి, రాపోలు సుదర్శన్, అంతటి సోములుగౌడ్, నగేష్‌గౌడ్ పాల్గొన్నారు.

పట్టుదలతో చదివారు.. కొలువు సాధించారు



గంజి అజయ్‌కుమార్



నూనెముంతల సాయికుమార్



పులిమామిడి గ్రీష్మారాణి



బట్ట విక్రమ్

శాలిగౌరారం: మండలంలోని ఎన్‌జీ కొత్తపల్లి గ్రామానికి చెందిన నూనెముంతల సాయికుమార్, పులిమామిడి గ్రీష్మారాణి, శాలిగౌరారం గ్రామపంచాయతీ పరిధిలోని బాలిశెట్టిగూడెంకు చెందిన బట్ట విక్రమ్ ఏఈఈ ఉద్యోగాలు సాధించారు. ఎన్‌జి కొత్తపల్లి గ్రామానికి చెందిన నూనెముంతల సాయికుమార్‌ది మధ్యతరగతి కుటుంబం. తల్లిదండ్రులు నూనెముంతల నర్సింహ–మంగమ్మ. నర్సింహ రేషన్‌డీలర్‌గా పనిచేస్తుండగా మంగమ్మ ఆరోగ్యశాఖలో నకిరేకల్ ప్రభుత్వ హాస్పిటల్‌లో ఏఎన్ఎంగా కాంట్రాక్ట్ పద్ధతిలో పని చేస్తోంది. పాఠశాల విద్యను నకిరేకల్‌లోని ప్రైవేట్ పాఠశాలలో, ఇంటర్ హైదరాబాద్‌లోని నారాయణ కళాశాలలో, సీవీఎస్ఆర్ కళాశాలలో బీటెక్ పూర్తిచేసిన సాయికుమార్ 2019లో రైల్వేశాఖలో గ్రూపు–డి ఉద్యోగం సాధించాడు. కానీ విధుల్లో చేరలేదు. 2020లో జూనియర్ పంచాయతీ కార్యదర్శి ఉద్యోగం సాధించి మర్రిగూడ మండలంలో కొంతకాలం పనిచేశాడు. ఆ తర్వాత ఉద్యోగానికి రాజీనామా చేసి పోటీ పరీక్షలకు సిద్ధమయ్యాడు. ప్రస్తుతం ఆర్‌డబ్ల్యూఎస్ శాఖలో ఏఈఈ ఉద్యోగం సాధించాడు.

❖ ఎన్‌జి కొత్తపల్లి గ్రామానికి చెందిన పులిమామిడి గ్రీష్మారాణిది మధ్య తరగతి కుంటుబం. తల్లిదండ్రులు పులిమామిమిగి చంద్రయ్య–సరితారాణి ఇద్దరూ ప్రభుత్వ ఉపాధ్యాయులే. గ్రీష్మారాణి పాఠశాల విద్య నల్లగొండలోని లిటిల్ ఫ్లవర్ స్కూల్, ఇంటర్ హైదరాబాద్‌లోని నారాయణ కళాశాలలో చదివింది. బీటెక్ ఎన్ఐటీ–కాలికట్(కేరళ)లో చదివారు. ప్రస్తుతం సివిల్ విభాగంలో ఏఈఈ(ఐ అండ్ సీఏడీ) ఉద్యోగాన్ని సాధించారు.

❖ శాలిగౌరారం గ్రామపంచాయతీ పరిధిలోని బాలిశెట్టిగూడెంకు చెందిన బట్ట విక్రమ్‌ది పేద కుటుంబం. తల్లిదండ్రులు బట్ట వెంకన్న–పూలమ్మ దంపతులు వ్యవసాయ కూలీలు. విక్రమ్ ఒకటి నుంచి ఐదవ తరగతి వరకు స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో, 6 నుంచి 10 వరకు భువనగిరిలోని సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాలలో, ఇంటర్ హైదరాబాద్‌లోని నాగోల్‌లో గల సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ కళాశాలలో, బీటెక్ వరంగల్‌లోని కాకతీయ విశ్వవిద్యాలయం, బీఈడి ఉస్మానియా విశ్వవిద్యాలయంలో చదివారు. 2019లో పంచాయతీ కార్యదర్శి ఉద్యోగం సాధించిన విక్రమ్.. ఓవైపు ఉద్యోగం చేస్తూనే ప్రస్తుతం ఆర్‌డబ్ల్యూఎస్ శాఖలో ఏఈఈ ఉద్యోగాన్ని సాధించాడు.

ఉషశ్రీకి మొదటి ప్రయత్నంలోనే..



నకిరేకల్ : మండలంలోని తాటికల్ గ్రామానికి చెందిన దొడ్డబోయిన ఉషశ్రీ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఉద్యోగానికి ఎంపికైంది. దొడ్డబోయిన రాములు– నిర్మల దంపతుల మొదటి సంతానం ఉషశ్రీ. ఆమె కర్ణాటకలోని నిట్‌లో బీటెక్ పూర్తి చేసింది. ప్రస్తుతం తిరుపతి ఐఐటీలో ఎంటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. మొదటి ప్రయత్నంలోనే ఏఈఈ ఉద్యోగం సాధించిన ఉషశ్రీని గ్రామానికి చెందిన పలువురు అభినందించారు.

ఏపీ లింగోటం వాసికి ఏఈఈ ఉద్యోగం

నార్కట్‌పల్లి : తెలంగాణ పబ్లిక్ సర్వీస్ పరీక్ష ఫలితాల్లో నార్కట్‌పల్లి మండలంలోని ఏపీ లింగోటం వాస్తవ్యుడు గంజి అజయ్‌కుమార్ రాష్ట్రంలో 63వ ర్యాంకు సాధించి రోడ్లు, భవనాల శాఖలో ఏఈఈ ఉద్యోగానికి ఎంపికయ్యారు. గ్రామానికి చెందిన గంజి యాదగిరి చేనేత కార్మికుడు. తల్లి రాధ టైలర్ పని చేస్తుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వారి కుమారుడు అంజయ్‌కుమార్ ఇంటర్మీడియట్ సర్వేల్ గురుకుల కళాశాలలో, ఉస్మానియా యూనివర్సిటీలో ఇంజనీరింగ్ పూర్తి చేశాడు.

మెటీరియల్ అందజేత



మెటీరియల్ అందజేస్తున్న ఏఎస్పీ

నల్లగొండ రూరల్: ఉద్యోగ పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే పేద విద్యార్థులకు నాతి లక్ష్మీనర్సింహ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెటీరియల్ అందజేయడం అభినందనీయమని ఏఎస్పీ భాస్కర్‌గౌడ్ అన్నారు. ఆదివారం నల్లగొండ పట్టణంలోని ఎంవీఎన్ విజ్ఞాన కేంద్రంలో రూ.40 వేల విలువైన గ్రూప్స్ మెటీరియల్‌ను ఎస్ఎల్ఎన్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ నాతి శ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ గ్రామాల్లో ఉన్న గ్రంథాలయాలకు పోటీ పరీక్షల మెటీరియల్ అందజేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో నాతి గణేశ్, మల్లం మల్లేష్, బల్లూరి మల్లయ్య, స్వామి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

'రాజకీయ కక్షతోనే కూల్చుతామంటున్నారు'

నల్లగొండ టూటౌన్ : రాజకీయ కక్షతోనే బీఆర్ఎస్ పార్టీ కార్యాలయ భవనాన్ని కూల్చేయాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అంటున్నాడని మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.ఈ నెల 11వ తేదీలోగా కూల్చాలని మంత్రి అధికారులను బెదిరించడం సమంజసం కాదన్నారు. తాము గతంలో అనుమతి కోసం దరఖాస్తు చేశామని, ఏ రాజకీయ కార్యాలయ భవనానికి అనుమతి లేకపోవడంతో అప్పటి మున్సిపల్ అధికారులు అనుమతి ఇవ్వకుండా జాప్యం చేశారని తెలిపారు. నిబంధనల మేరకు 33 శాతం జరిమానా చెల్లిస్తామని అనుమతి ఇవ్వాలని కలెక్టర్‌కు, మున్సిపల్ కమిషనర్‌కు నెల రోజుల క్రితమే దరఖాస్తు చేశామన్నారు. కొన్ని పార్టీల భవనాలకు 'స్థలాల పత్రాలు కూడా లేవన్నారు. మంత్రి అధికారం అడ్డం పెట్టుకుని చేసే ప్రజా వ్యతిరేక కార్యక్రమాలను చట్టపరంగా ఎదుర్కొంటామన్నారు.

ప్రాజెక్టులు పూర్తి చేయాలి

చిట్యాల: జిల్లాలో అసంపూర్తిగా ఉన్న సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణాలకు నిధులను మంజూరు చేసి వెంటనే పూర్తి చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చిట్యాలలో ఆదివారం జరిగిన సీపీఐ మండల కౌన్సిల్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. చిట్యాల మండలానికి సాగునీటి నందించే ఉదయ సముద్రం ప్రాజెక్టు, ధర్మారెడ్డిపల్లి, పిల్లాయిపల్లి కాల్వల నిర్మాణాలను వెంటనే పూర్తి చేయాలన్నారు. సీపీఐ మండల కార్యదర్శి అక్బర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో గీత పనివారల సంఘం జిల్లా కార్యదర్శి బొడిగె సైదులుగౌడ్, జిల్లా సత్యం, జిల్లా లక్ష్మణ్, షరీఫ్, బొల్లూరు లింగయ్య, దేశగోని బాలరాజు, గుండాల సత్తయ్య, శేఖర్‌రెడ్డి, బాల్‌రెడ్డి, వెంకన్న, రామలింగయ్య పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలం

చండూరు(గట్టుప్పల్) : చేనేత కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి అన్నారు. చేనేత సమస్యలు పరిష్కరించాలని బీజేపీ చేనేత సెల్ జిల్లా కన్వీనర్ వర్కాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో గట్టుప్పల్ మండల కేంద్రంలో ఆదివారం ఒక్కరోజు దీక్ష చేపట్టారు. దీక్ష శిబిరాన్ని సందర్శించిన అనంతరం ఆయన మాట్లాడారు. కార్మికులకు 11 నెలలుగా త్రిఫ్ట్ ఫండ్ నిధులు రావడం లేదని, 8 నెలలుగా చేనేత మిత్ర నిధులు విడుదల కాలేదన్నారు. ఆలె భాస్కర్‌రాజ్ , చేనేత సెల్ రాష్ట్ర కన్వీనర్ మచ్చా సుధాకర్‌రావు, ఓబీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంజయ్, మిర్యాల వెంకటేశం, జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు పిట్టల శ్రీనివాస్, ఎన్నం శివకుమార్, మచ్చా సుధాకర్ రావు, ఓబీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

అవార్డులు అందజేత

చండూరు : లయన్స్ క్లబ్ ఆఫ్ చండూరు సేవ అధ్యక్షుడు ఎంజేఎఫ్ కొత్తపాటి సతీష్ 2023–24 సంవత్సరానికిగాను ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ డాక్టర్ పాటిహిల్ చేతులమీదుగా ఆదివారం జిల్లా కేంద్రంలో పలు అవార్డులు అందుకున్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



కట్టంగూర్ : సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు



చిట్యాల : వట్టిమర్తి జెడ్పీహెచ్ఎస్‌లో..



చిట్యాల: సమ్మేళనంలో పాల్గొన్న ఇంటర్ పూర్వ విద్యార్థులు



మునుగోడు: సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి



మల్లన్నగుట్టపై విత్తన బంతులు చల్లుతున్న ఎస్ఐ శివతేజ

కేతేపల్లి: ప్రతిఒక్కరూ విధిగా మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని కేతేపల్లి ఎస్ఐ శివతేజ అన్నారు. నల్లగొండ సీడ్ బాల్స్ విద్యార్థులు తయారు చేసిన దాదాపు 7500 విత్తన బంతులను ఆదివారం మండలంలోని ఇనుపాముల గ్రామంలో హైవే వెంట గల మల్లన్న గుట్టపై చల్లారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ పాల్గొని మాట్లాడుతూ చెట్లను యథేచ్ఛగా నరికివేయడం వల్ల పర్యావరణం దెబ్బతిని వాతావరణంలో సమతుల్యత దెబ్బతింటోందన్నారు. మానవుల మనుగడకు మూలాధారమైన అడవులను కాపాడి వన్య ప్రాణుల సంరక్షణకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జాల వెంకట్‌రెడ్డి, ఏఎస్ఐ దైవ సహాయం, పోలీసు సిబ్బంది గౌతమి, సతీష్, సురేష్, విద్యార్థులు చల్లోజు హరీందర్, జస్వంత్, ఎ.ఓంకార్, యాదగిరి పాల్గొన్నారు.

టీయూడబ్ల్యూజే ఎలక్ట్రానిక్ మీడియా కమిటీ ఎన్నిక

నల్లగొండ టూటౌన్ : టీయూడబ్ల్యూజే 143 అనుబంధ ఎలక్ట్రానిక్ మీడియా నూతన కమిటీని ఆదివారం నల్లగొండలోని లయన్స్ క్లబ్ భవన్‌లో ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా ఎ.వెంకట్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా డి.పుల్లారావు, ఎం.వెంకట్‌రెడ్డి, బొడ్డు సతీష్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా సల్వాది జానయ్య, కార్యదర్శులుగా కురుపాటి శ్రవణ్, మండల నాగేందర్, మల్లేష్, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా గిరి, రాజు, స్పోర్ట్స్ సెక్రటరీలుగా హాతిరామ్ నాయక్, కాశి, సాంస్కృతిక కార్యదర్శులుగా శ్రీనివాస్‌రెడ్డి, మణి, కోశాధికారిగా పి.నాగరాజుతోపాటు పలువురు జర్నలిస్టులు కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు. అనంతరం నూతన కమిటీకి టీయూడబ్ల్యూజే 143 జిల్లా అధ్యక్షుడు గుండగోని జయశంకర్‌గౌడ్ నియామక పత్రాలు అందజేశారు.

విద్యార్థికి చేయూత

కనగల్: మండలంలోని ఓ ఎంబీబీఎస్ విద్యార్థికి లక్ష్మీనర్సింహ ఫౌండేషన్ వారు రూ.లక్షా పదివేలు చేయూతనందించింది. వివరాలు.. కనగల్ మండల పరిధిలోని గడ్డంవారి ఎడవెల్లి గ్రామానికి చెందిన కొప్పుల అనిల్ ఎంబీబీఎస్ చివరి సంవత్సరం చదువుతున్నాడు. అనిల్ కాలేజీ, హాస్టల్ ఫీజు కట్టలేక ఇంటి వద్దే ఉంటున్నాడు. ఈ విషయం తెలిసిన లక్ష్మీనర్సింహ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు నాతి శ్రీనివాస్ ఆదివారం అనిల్, వారి కుటుంబ సభ్యులను కలిసి లక్షా 10 వేల రూపాయలు అందజేశారు. అనిల్ చదువులకు సహకరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు బలుగూరి వెంకన్న, నాతి గణేశ్, కర్నాటి గిరి, గౌని నరేష్, కమ్మంపాటి నగేష్ పాల్గొన్నారు.



అనిల్‌కు చేయూత అందిస్తున్న ఫౌండేషన్ సభ్యులు